

నృత్యం చేస్తున్న ఆదివాసీ యువతులు

# బీఆర్ఎస్‌కే జైకొట్టిన ఆదివాసులు

- కోవ లక్ష్మికి అండగా నిలిచిన ఏజెన్సీ గ్రామాలు
- పది మండలాల నుంచి పూర్తిస్థాయిలో మెజార్టీ

ఆసిఫాబాద్, డిసెంబర్ 7 : ఆసిఫాబాద్ నియోజకవర్గ ఆదివాసులు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి జైకొట్టారు. నియోజవర్గంలో 2,26,664 ఓట్లు ఉండగా.. ఇందులో 1,83,534 ఓట్లు పోలయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మైనార్టీ ఓట్లలో అత్యధికంగా ఆదివాసీ తెగలకు చెందిన వారు బీఆర్ఎస్‌కే ఓటేసి మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ లంబాడా తెగకు చెందిన వ్యక్తి కావడంతో ఆదివాసీ తెగకు చెందిన కోవ లక్ష్మికి ఏజెన్సీ గ్రామాలు అండగా నిలిచాయి. కెరమెరి, సిర్పూర్(యు), గాదిగూడ, జైనూర్, తిర్యాణి మండలాల నుంచి మెజార్టీ ఓట్లు పడ్డాయి. అత్యధికంగా సిర్పూర్(యు), అతి తక్కువగా ఆసిఫాబాద్ మండలంలో మెజార్టీ వచ్చింది. కోవ లక్ష్మి కూతురు కోవ అరుణ జడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిర్పూర్(యు) మండలం నుంచి 5,389 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండో స్థానంలో కోవ లక్ష్మి జడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్న జైనూర్ మండలం నుంచి 4,646 ఓట్లు వచ్చాయి. సొంత మండలమైన తిర్యాణి నుంచి 3,701 ఓట్ల మెజార్టీ వచ్చింది. గాదిగూడ మండలం నుంచి 3,686, ఆమె అమ్మగారి మండలం వాంకిడి నుంచి 2,221, లింగాపూర్ 1,976, రెబ్బెన 753, కెరమెరి 594, నార్నూర్ 77,ఆసిఫాబాద్ 33 మంది ఓట్ల మెజార్టీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 10 మండలాల్లోనూ మంచి మెజార్టీ వచ్చింది.

### కలిసొచ్చిన పోడు పట్టాలు, సంక్షేమ పథకాలు..

ఆసిఫాబాద్ నియోజవర్గంలో కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం.. పోడు పట్టాలు, రైతు బంధు, రైతుబీమా వంటివి కలిసొచ్చాయి. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు పొందుతున్న వారు బీఆర్ఎస్ వైపు నిలిచారు. అంతేకాకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు, బీసీ, మైనార్టీ రుణాలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు బీఆర్ఎస్‌కు మేమున్నామని అండగా నిలిచారు. మిషన్ భగీరథ నీరు ఏజెన్సీ గ్రామాల్లో చెరగని ముద్ర వేసింది. విద్యలో వెనుక బడ్డప్పటికీ ఇక్కడి ప్రజల ఆలోచన విధానం మాత్రం ముందంజలో ఉంటుందని నిరూపించారు. పని చేసేవారికే అధికారం ఇవ్వాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపారు.

# పంట తడిసిందా.. ఈ జాగ్రత్తలు తీసుకోండి..

తాండూర్, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుఫాన్ అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నది. పంట చేతికొచ్చే తరుణంలో వర్షం కురుస్తుండడం, వాతావరణంలో మార్పులు రావడం, వరి కోత దశలో ఉండడం, పత్తి ఏరడానికి కూలీలు దొరకక పోవడం, కొన్నిచోట్ల కల్లాల్లో ధాన్యం ఉండడం వంటివి నష్టాలు కలిగించేలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాగా.. వర్షం తగ్గిన తర్వాత మొక్కలను పరిశీలిస్తూ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని.. మందు మోతాదు మేరకు పిచికారీ చేయాలని తాండూర్ వ్యవసాయాధికారి గాదర్ల కిరణ్మయి తెలిపారు.

### పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చేనులో తడిసిన పత్తిని తీయకుండా ఎండిన తర్వాతనే ఏరాలి. ప్లాస్టిక్ పట్టాలపై రెండు, మూడు రోజులు అరబెట్టాలి. ఇలా చేయడం వల్ల తేమ శాతం తగ్గి, గింజ గట్టిపడి శుభ్రంగా ఉంటుంది. ● ఎనిమిది శాతం తేమ ఉన్న పత్తిని గోనె సంచుల్లో తొక్కి తేమ తగలని చోట నిల్వ చేయాలి. దీంతో పత్తి రంగు మారకుండా ఉండి ధర అధికంగా వచ్చే అవకాశం ఉంది.



తాండూర్ శివారులోని వర్షానికి తడిసిన పత్తి

### వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షంలో తడిసిన గింజలు రంగు మారడం, సరిగ్గా మొలకెత్తకపోవడం, మిల్లింగ్‌లో ఎక్కువ నూక రావడం, నాణ్యత తగ్గడంతోపాటు రేటు కూడా తగ్గుతుంది. ● ధాన్యం దెబ్బ తినకుండా ఉండేందుకు పొలంలో నీరు నిలిచిన చోట కాల్వలు తీసి నీటిని బయటికి పంపాలి. ● ఒకవేళ వర్షం ఎక్కువై నీరు నిల్వ ఉంటే నాలుగైదు దుబ్బులు కలిపి నిలబెట్టి కట్టలు కట్టాలి. దీంతో వరి దుబ్బులు కింద పడకుండా ఉంటాయి.
- లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపి పడిపోయిన పైరుపై పిచికారీ చేసుకోవాలి. దీంతో గింజ రంగు మారడం తగ్గి మొలకెత్తకుండా ఉంటాయి.

### వానతో బాగా నష్టపోయా..

నెన్నెల, డిసెంబర్ 7 : మూడు రోజులుగా కురుస్తున్న వాన పత్తి పంటను బాగా దెబ్బతీసింది. నేను ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి వేశా. ఎకరానికి రూ.12 వేలు చెల్లిస్తున్నా. పంట మంచిగానే వచ్చింది. పూత, ఖాత చెట్టు నిండా కనిపించింది. పెట్టిన పెట్టుబడి వస్తోందని నాలుగు పైసలు కష్టపడ్డందుకు మిగులుతాయనుకున్నా. ఈ వర్షం పడడంతో నాకు ఆశలు లేకుండా చేశాయి. ఎకరానికి పది నుంచి పన్నెండు క్వింటాళ్ల పత్తి వస్తుందనుకున్నా. చేతికొచ్చే సమయంలోనే వాన పడింది. పత్తి బాగా తడిసి పోయింది. మూడు రోజులుగా జల్లులు పడడంతో తడిసింది. ఎక్కడ చూసినా పత్తి తడిసి నల్లబడింది. పత్తి నల్లబడడంతో మా పని అయిపోయింది. ఇక ధర కూడా తక్కువగా వస్తది. కొనే వారు కూడా రంగు మారిన పత్తిని బాగా తక్కువ ధరకు అడుగుతరు. ధర పడి పోతే మాకు పెట్టిన పెట్టుబడి కూడా రాదు. తడిసిన పత్తి తీసి ఆరాబెట్టే సరికి రోజులు పడుతాయి. ఇలా ఆర పెట్టిన పత్తి తూకంలో కూడా బరువు రాదు. ఎకరానికి దాదాపు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు నష్ట పోవాల్సి వస్తుంది. ఐదెకరాలలో దాదాపు రూ.35 వేల వరకు నష్ట పోతున్న. ధర కూడా తక్కవగా అవుతుంది. లాభం రాక పోవచ్చు. ఈ వర్షం ఇంకా పడినట్లయితే చేతులు కాల్చుకున్నట్లే. తెచ్చిన అప్పులు పెరిగి పోతయ్.

*- అబ్బర్ల శ్రీనివాస్, కౌలు రైతు, నెన్నెల మండలం.*



# దూది రైతు దుఃఖం

## పత్తి రైతులను నిండా ముంచిన మిగ్‌జాం తుఫాన్

- వర్షపు నీళ్లతో నిండి నేలరాలుతున్న దూది ● నల్లబారితే తక్కువ ధర వస్తోందని ఆవేదన
- కల్లాలు, రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం వర్షార్పణం ● రైతులను ఆగమాగం చేస్తున్న అకాలవర్షం
- ఉమ్మడి జిల్లాలో ఏ కర్షకుడిని కదిలించినా కన్నీరే..

మంచిర్యాల, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మిజ్‌గాం తుఫాను రైతులను నిలువెల్లా ముంచింది. మూడు రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పడుతున్న అకాల వర్షాలు, ఈదురుగాలులతో కూడిన ముసురు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ముఖ్యంగా పత్తి రైతును వర్షం ఆగం చేసింది. మూడు రోజులుగా కురుస్తున్న తుంపర్లకు చేనులో పత్తి పూర్తిగా తడిసింది. పత్తి పువ్వు మొత్తం నీళ్లతో నిండిపోయి బరువెక్కింది. కొన్ని చోట్ల చెట్ల మీద నుంచి పత్తి రాలి పోతున్నది. మంచిర్యాల జిల్లా నెన్నెల, వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్ రూరల్, కన్నేపల్లి, భీమిని, ఆసిఫాబాద్.. ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో పత్తి చేలలో ఇవే దృశ్యాలు కనిపించాయి. భారీ వర్షం కాదు పెద్ద నష్టం ఏం లేదని వ్యవసాయ అధికారులు చెప్తున్నా.. చేలలో తడిసిన పత్తి నల్లబారుతోందని దానితో దిగుబడి తగ్గి, సగం ధర కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పత్తిని ఏరించలేక, తడిసిన పత్తిని వదిలేసి వెళ్లలేక పంటను చూసి తల్లడిల్లిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ లెక్కన పత్తి సాగు చేసిన రైతులు అధికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మరోవైపు కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్ల వెంట కోత కోసి రాసులుగా పోసిన ధాన్యం వర్షార్పణమైంది. పరదాల కింది నుంచి పోయేంత వర్షం రాకపోయినా.. కొంత వరకు ధాన్యం తడిసింది. దీంతో కల్లాల దగ్గర రైతులు ఆరబోసి కూర్చోవాల్సిన దుస్థితి వచ్చింది. ఒకవేళ మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే ఇబ్బంది పెరిగే అవకాశం ఉంది.

### తడిసిన పత్తిని కొనుగోలు చేయాలి..

కోటపల్లి, డిసెంబర్ 7 : వర్షానికి తడిసి, రంగు మారిన పత్తిని కొనుగోలు చేయాలి. వర్షానికి పత్తి తడిసిపోయి రంగు మారడం వల్ల మాకు మద్దతు ధర వచ్చేలా లేదు. పత్తి చేతికి వచ్చిన సమయంలో తుఫాను రావడం వల్ల రైతులందరూ నష్టపోవాల్సి వస్తోంది. రైతులందరికీ న్యాయం చేసేందుకు తడిసిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేసి మాకు న్యాయం చేయాలి.

*- కొట్టె స్వామి, రైతు, కోటపల్లి*



# మిగ్‌జాం పంజా

- తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో పెను మార్పులు
- పడిపోతున్న టెంపరేచర్‌తో ఇబ్బందులు పడుతున్న జనం
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా 18 డిగ్రీలకు చేరిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- కురుస్తున్న మంచు, చిరుజల్లులతో పత్తి, శనగ పంటకు నష్టం

నిర్మల్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. చాలా చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలి తీవ్రత పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో చిరుజల్లులు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం కనిష్ఠ ఉష్ణోగ్రత 18 డిగ్రీలకు చేరుకోగా, గరిష్ఠ టెంపరేచర్ 22-23 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ముఖ్యంగా సోన్ మండలంలోని పాక్‌పట్ల, నిర్మల్ రూరల్ మండలంలోని ముజ్గి, సారంగాపూర్ మండలంలోని జామ్, కుంటాల, మామడ మండలాల్లోని తాండ్ర గ్రామాల్లో గత 24 గంటల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే 15 రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందంటున్నారు. మరో రెండు రోజులపాటు తుఫాన్ ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

### కమ్మేస్తున్న పొగమంచు

తుఫాన్ ప్రభావంతో పల్లెలు, పట్టణాలు, ముఖ్యంగా గిరిజన గూడేలను పొగమంచు పూర్తిగా కమ్మేసింది. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరగడమే కాకుండా, ఉదయం నుంచి రాత్రి వరకు శీతలగాలులు, కురుస్తున్న చిరుజల్లులతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 10 గంటల వరకు ప్రధాన రహదారులపై దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకొని వెళ్లాల్సి వస్తున్నది. గిరిజన గూడేలు, తండాల్లో చలి నుంచి కాపాడుకునేందుకు చలి మంటలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా మామడ, ఖానాపూర్, పెంబి, సారంగాపూర్ మండలాల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల గిరిజన గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది.



తుఫాన్ కారణంగా మంచు కురవడంతో తేమ ఎక్కువై ఎర్రబారుతున్న శనగ పంట

### చిరుజల్లులతో పత్తి, శనగ పంటలకు నష్టం

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న మంచు, చిరుజల్లులతో పత్తి, శనగ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో చిరు జల్లులు కురుస్తుండడంతో పత్తి తడిసిపోతున్నది. దీంతో తడిసిన పత్తిని కొనుగోలు చేసేందుకు స్థానిక వ్యాపారులు ముందుకు రావడం లేదు. అలాగే శనగ పంటకు తేమ అధికం కావడంతో ఎర్రబారి పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని ముథోల్, బాసర, తానూర్, కుభీర్, భైంసా, లోకేశ్వరం మండలాల్లో రైతులు ఎక్కువగా పత్తి, శనగ పంటలను వేస్తారు. ఆయా మండలాల్లో మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులతోపాటు, రాత్రి పూట విపరీతంగా మంచు కురుస్తున్నది. దీంతో పంట ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడనున్నది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలిచ్చి వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఆరోగ్యం వెంబడి..

## పెద్దపేట పాఠశాలలో కిచెన్ గార్డెన్

- మధ్యాహ్న భోజనానికి సేంద్రియ పంటలు ● స్కూల్ ఆవరణలో వివిధ రకాల కూరగాయల సాగు..
- ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ ● ఉదయం, సాయంత్రం వివిధ పనులు

దండేపల్లి, డిసెంబర్ 7: మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. అందులో పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వడం వారి ఎదుగుదలకు దోహదం చేస్తుంది. అయితే ఇక్కడ ఓ పాఠశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో దండేపల్లి మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ కూరగాయలు, ఆకు కూరలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్నారు. కాగా పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులు చదువుతున్నారు.

### ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కట్టుగా...

ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది కలిసికట్టుగా కిచెన్ గార్డెన్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం పాఠశాల సమయానికి 30 నిమిషాలు ముందు, తరగతులు ముగిసిన తర్వాత మరో 30 నిమిషాలు కిచెన్ గార్డెన్‌లో కలుపుతీత, మొక్కలకు నీళ్లు పెట్టడం, వంటి వాటిని చేపట్టి పరిరక్షించడంలో నిమగ్నమవుతున్నారు. దీంతో పంటలు ఎలా పండిస్తారనే అవగాహనతోపాటు గౌరవం పెరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



పెద్దపేట ప్రాథమిక పాఠశాల



పాఠశాల ఆవరణలో సాగుచేసిన మిర్చి

### సాగు చేస్తున్న కూరగాయలు..

మధ్యాహ్న భోజనంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు తాజా ఆకుకూరలు, కూరగాయలతో భోజనం పెట్టేందుకు పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌లో టమాట, మిర్చి, వంకాయ, చిక్కుడు, అల్చెంత, ఆకు కూరలు, చిక్కుడు, బీరకాయలు పండిస్తున్నారు. వీటితో పాటు పోపులో ఉపయోగించేందుకు వెల్లుల్లి ఆకులు, కొత్తిమీర, పుదీన వంటి ఆకులను సాగుచేస్తున్నారు. కిచెన్‌గార్డెన్‌లో సాగు చేస్తున్న కూరగాయలు సరిపోని సమయంలో సమీప వారసంతలో కొనుగోలు చేస్తున్నారు.



### విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశాం. ప్రతి రోజూ పాఠశాల ఆవరణలో పండించిన కూరగాయలతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. విద్యార్థులకు చదువుతో పాటు, పంటలు పండించే పద్ధతులను ఉదయం, సాయంత్రం నేర్పిస్తున్నాం. సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నాం. కిచెన్ గార్డెన్‌లో పండించిన కూరగాయలు తాజాగా ఉండడంతో పాటు, పురుగుల మందుల వినియోగం లేకపోవడంతో వంటలు రుచికరంగా ఉంటున్నాయి.

*-శ్రీలత, హెచ్‌ఎం, పెద్దపేట ప్రాథమిక పాఠశాల*



నిరుపేదలు, యాచకులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న ఫుడ్‌బ్యాంక్ వాలంటీర్లు

### ఆకలి బాధ తెలిసినందుకే..



తనకు ఆకలి బాధ తెలిసినందుకే ఫుడ్‌బ్యాంక్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. అమ్మ-నాన్న, భార్యతోపాటు మిత్రుల సహకారంతో ఫుడ్‌బ్యాంక్ రూపుదిద్దుకున్నది. ఎవరైనా దాతలు సహాయం చేసేందుకు ముందుకొస్తే వారి సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. నిరుపేద అభాగ్యులకు కడుపునిండా భోజనం అందిస్తున్న అనుభూతి అనిర్వచనీయం. అన్నార్థులకు ఆకలి తీర్చే ఈ మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలనుకునే వారు 9603191980 నంబరును సంప్రదించాలి.

*- శ్రీధర్ రాథోడ్, ఆదర్శనగర్, నిర్మల్, ఫుడ్‌బ్యాంక్ వ్యవస్థాపకుడు.*

# అభాగ్యులకు ఆపన్నహస్తం

## 'ఫుడ్ బ్యాంక్ నిర్మల్' పేరిట అన్నార్థులకు అన్నదానం

- ఇప్పటివరకు లక్ష మందికిపైగా అందిన ఆహారం ● స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీధర్ రాథోడ్
- కరోనా కష్టకాలంలోనూ చేయూత

నిర్మల్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ) : ఆకలి బాధ తెలిసిన ఓ యువకుడు అభాగ్యులకు, నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. పేదరికంతోపాటు, నిరుద్యోగాన్ని ఎదుర్కొన్న ఆ యువకుడు.. తనకు బ్యాంకు కొలువు వచ్చిన తర్వాత తాను అనుభవించిన ఆకలి కష్టాలు మరొకరికి రావద్దని భావించాడు. ఆకలితో అలమటిస్తున్న పేదలకు బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా మరికొంత మంది యువకులను కలుపుకొని 'ఫుడ్ బ్యాంక్ నిర్మల్' పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. నిర్మల్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగి శ్రీధర్ రాథోడ్ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్నదే ఈ ఫుడ్ బ్యాంక్. ఇప్పటి వరకు లక్ష మందికిపైగా నిరుపేదలు, అభాగ్యులకు భోజనం అందించాడు. మొదట తన ఇంట్లోనే ఆహారాన్ని తయారు చేయించి తాను బ్యాంకుకు వెళ్లే దారిలో కనిపించే పేదలకు, యాచకులకు ఈ ఆహారం ప్యాకెట్లను అందించేవాడు. ఆయన ఆశయానికి మరికొంత మంది మిత్రులు గుగ్లావత్ రవీందర్, దేదావత్ వీరన్న, మాముల రమేశ్, సుంకరి గణేశ్, సంజీవ్, కాసం ముత్యం, హరిచరణ్, ఉప్పు శిరీష, రమేశ్, స్వరాజీ, మహారాజు రవి, మహేందర్, రాథోడ్ అంబు, దినేశ్, రితేశ్ తోడయ్యారు. వీరంతా కలిసి ప్రతి ఆదివారం మురికివాడలు, రోడ్ల పక్కన గల పూరి గుడిసెల్లో జీవించే నిరుపేదలు, ఇతర ప్రాంతాల నుంచి కూలీ పనులకు వచ్చే పేదలకు ప్రత్యేకంగా తయారు చేయించిన భోజనాన్ని ప్యాకెట్ల ద్వారా అందిస్తున్నారు. భోజనంతోపాటు దుప్పట్లు, బట్టలు లాంటివి కూడా పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫుడ్ బ్యాంకులో 30 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా ఆహారం పంపిణీలో పాల్గొంటున్నారు. ఫుడ్‌బ్యాంక్ ఏర్పాటు చేసి ఏడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ఇకపై ప్రతిరోజు కూడా పేదలకు అన్నదానం చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. ముఖ్యంగా కరోనా కాలంలో భోజనం అందించి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు.

### సెలవు దినం.. సేవకు అంకితం..

'సెలవు దినం... సేవకు అంకితం' పేరిట ప్రత్యేక భోజనాన్ని తయారు చేయించి నిర్మల్‌కు నాలుగు వైపులా భోజనాన్ని పంపిణీ చేస్తున్నారు. అలాగే ఫుడ్ బ్యాంక్ నిర్మల్ సంస్థలో సేవా భావాలు ఉన్నవారి పుట్టిన రోజులు, పెళ్లి రోజు వేడుకలను జరుపుకునే విధంగా కూడా చూస్తున్నారు. వీరిచ్చే విరాళాలతో ఆదివారం ప్రత్యేక భోజనాన్ని తయారు చేయిస్తున్నారు. ఏడేళ్ల నుంచి తమ జీతం నుంచి ప్రతినెల కొంత జమ చేయడమే కాకుండా, స్వచ్ఛందంగా దాతలిచ్చే విరాళాలతో ఫుడ్‌బ్యాంక్ నిర్వహణను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. కాగా.. ఇప్పటివరకు ఆదివారం మాత్రమే భోజనం అందించామని, మా సంస్థ ప్రారంభించి ఏడేళ్లు పూర్తి చేసుకొని ఎనిమిదో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా జనవరి 1 నుంచి ప్రతి రోజు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.